# ప్రజా మాటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 183 పేజీలు : 04 వెల రూ. 2 మంగళవారం 06 - 01 - 2026




ఈ నెల 18న మేడారంకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## తెలంగాణలో నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

- వైద్యశాఖలో త్వరలోనే 850 పోస్టుల భర్తీ
- పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- కొత్తగా 490 వెంటిలేటర్లు, 9 ఎంఆర్ఐ యంత్రాల కొనుగోలుకు నిర్ణయం
- నిమ్స్‌లో 125 వెంటిలేటర్లు..
- అంబులెన్స్ రెస్పాన్స్ టైమ్‌ను 10 నిమిషాలకు తగ్గించేందుకు చర్యలు
- బస్తీ దవాఖానాలకు నేరుగా మందుల సరఫరా చేసేలా కొత్త విధానం

## తెలంగాణలో మరో 17 మంది మావోయిస్టులు మాత్రమే ఉన్నారు

- డీజీపీ శివధర్ రెడ్డి
- 17 మంది లొంగిపోతే తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా నిలుస్తుందని వెల్లడి
- అందులో నలుగురు కేంద్ర కమిటీ, ఐదుగురు రాష్ట్ర కమిటీ సభ్యులు ఉన్నట్లు వెల్లడి
- ఆపరేషన్ కగార్ గడువుకు ముందే తెలంగాణ మావోయిస్టు రహితమవుతుందన్న డీజీపీ
- నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిస్తే పోలీసు శాఖ నుంచి వారికి అవసరమైన సహాయం అందుతుందని డీజీపీ పేర్కొన్నారు



రాష్ట్రానికి చెందిన మరో 17 మంది మావోయిస్టులు లొంగిపోతే తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా నిలుస్తుందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన వారు 17 మంది మాత్రమే ఉన్నారని ఆయన వెల్లడించారు. వారిలో కేంద్ర కమిటీలో నలుగురు, రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు, అండర్ గ్రౌండ్‌లో ఇద్దరు ఉన్నారని తెలిపారు. వారిలో ఐదుగురు మహిళలు ఉన్నారని ఆయన అన్నారు. ఈ 17 మంది మావోయిస్టులపై మొత్తం రూ. 2.25 కోట్ల రివార్డు ఉందని ఆయన చెప్పారు. వారంతా లొంగిపోవాలని డీజీపీ శివధర్ రెడ్డి సూచించారు. ఆపరేషన్ కగార్

- మిగతా 2 లో

## వ్యక్తిగా వెళుతున్నా... రాజకీయ శక్తిగా తిరిగి వస్తా

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీపై కీలక ప్రకటన
- కచ్చితంగా గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతానని ఆమె ధీమా వ్యక్తం
- తెలంగాణ జాగృతి త్వరలోనే రాజకీయ పార్టీగా అవతరిస్తుందన్న కవిత
- వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేస్తామని వెల్లడి
- తనది ఆస్తుల పంచాయితీ కాదని, ఆత్మగౌరవ పంచాయితీ అన్న కవిత



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై కీలక ప్రకటన చేశారు. తన సంస్థ త్వరలోనే రాజకీయ పార్టీగా అవతరిస్తుందని, అందరూ తనను ఆశీర్వదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. శాసనమండలిలో ఆమె మాట్లాడుతూ, తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారబోతోందని, రాబోయే ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తామని ప్రకటించారు. కచ్చితంగా గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. "వ్యక్తిగా సభ నుంచి వెళుతున్నా.. రాజకీయ శక్తిగా తిరిగి వస్తా" అని కవిత ప్రతిజ్ఞ చేశారు. ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్

- మిగతా 2 లో

## వెనెజువెలా అధ్యక్షుడికి పుట్టపర్తితో బలమైన బంధం



- సత్యసాయికి పరమభక్తుడు మదురో
- వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సత్యసాయి బాబా భక్తులు
- 2005లో పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని సందర్శించిన మదురో దంపతులు
- తన కార్యాలయంలో సాయిబాబా చిత్రపటాన్ని ఉంచుకునేవారు మదురో
- సాయిబాబా మరణించినప్పుడు వెనెజువెలాలో జాతీయ సంతాప దినం ప్రకటించిన వైనం

## కోనసీమలో ఓఎన్జీసీ సైట్ వద్ద భారీ అగ్నిప్రమాదం

- మంత్రులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు
- కోనసీమ జిల్లా మలికిపురంలో ఓఎన్‌జీసీ డ్రిల్ సైట్‌లో గ్యాస్ లీక్
- మరమ్మతు పనుల సమయంలో భారీగా ఎగిసిపడిన మంటలు
- రెండు గంటల పాటు కొనసాగిన లీకేజీతో స్థానికుల్లో తీవ్ర భయాందోళన
- పరిస్థితి అదుపులోకి తెచ్చిన అధికారులు, సహాయక చర్యలు ముమ్మరం



కోనసీమ జిల్లాలో తీవ్ర ఆందోళన నెలకొంది. మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలోని ఓఎన్జీసీ డ్రిల్లింగ్ సైట్‌లో భారీ గ్యాస్ లీకేజీ జరిగి, పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సోమవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓఎన్జీసీకి చెందిన మోరీ-5 బావి వద్ద ఉన్న గ్యాస్ పైప్‌లైన్ నుంచి ఒక్కసారిగా గ్యాస్ పైకి చిమ్మడంతో మంటలు వ్యాపించాయి. దాదాపు రెండు గంటల పాటు పెద్ద శబ్దాలతో గ్యాస్ లీక్ అవడంతో స్థానికులు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో సమీపంలోని కొబ్బరి తోటలకు మంటలు అంటుకొని, 500కు పైగా చెట్లు కాలిపోయినట్లు ప్రాథమికంగా అంచనా

- మిగతా 2 లో

## అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నివాసంపై కాల్పులు



- జేడీ వాన్స్ నివాసంపై కాల్పులు జరిపిన దుండగుడు
- కాల్పుల్లో జేడీ వాన్స్ ఇంటి అద్దాలు ధ్వంసం, నిందితుడు అరెస్టు
- అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నివాసం వద్ద ఘటన
- ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఘటన జరిగినప్పుడు వాన్స్ కుటుంబం ఇంట్లో లేదన్న అధికారులు
- సీక్రెట్ సర్వీస్, స్థానిక పోలీసుల సంయుక్త దర్యాప్తు

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నివాసంపై దాడి జరిగింది. ఓహియోలోని ఆయన ఇంటిపై ఓ దుండగుడు కాల్పులు జరిపాడు.

- మిగతా 2 లో


## మాతృభాష మన మూలాలకు సంకేతం




- మాతృభాషలో రాణిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తాం
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- త్యాగధనులను గుర్తు పెట్టుకుంటే స్ఫూర్తిదాయకంగా ఉంటుంది
- నందమూరి తారక రామారావు ఆత్మగౌరవంతో ముందుకెళ్లారు
- తెలుగు జాతి ఉన్నంతవరకు గుర్తు పెట్టుకునే ఏకైక నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడిన చంద్రబాబు

## తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషం కాదు - సమైక్యత అవసరం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- గంగ-కావేరి కలవాలని, దేశంలో నీటి సమస్య పోవాలన్న సీఎం చంద్రబాబు
- ఐకమత్యంగా ఉంటేనే తెలుగువాళ్లు ప్రపంచంలో నెంబర్‌వన్ అవుతారని అభిప్రాయం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- తెలుగువాళ్లు కలిసుంటే ఎన్నో సమస్యలు పరిష్కరించుకోవచ్చని సీఎం చంద్రబాబు
- త్వరలో పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుంది. కృష్ణా-గోదావరి నదుల అనుసంధానం జరుగుతుందన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు
- రెండు తెలుగు రాష్ట్రాలు ఒకరినొకరు అర్థం చేసుకుని కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు వివరించారు.
- ఈ నెల 7న ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం పర్యటనకు వెళ్లనున్నారు



గుంటూరులో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో సీఎం గోదావరి జలాల గురించి మాట్లాడారు. తెలుగువాళ్లు కలిసుంటే ఎన్నో సమస్యలు పరిష్కరించుకోవచ్చని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎన్టీఆర్ హయాంలో ఉమ్మడి ఏపీలో పలు ప్రాజెక్టులు కట్టినట్లు వివరించారు. చంద్రబాబు నాయుడు హయాంలో తెలంగాణలో కల్వకుర్తి, ఏఎంఆర్, నెట్టెంపాడు పూర్తి చేశామని సీఎం గుర్తు చేశారు. భీమా ఎత్తిపోతల కూడా చంద్రబాబు హయాంలోనే పూర్తయిందని అన్నారు. గోదావరిపైనా ఉమ్మడి ఏపీలో అనేక ప్రాజెక్టులు కట్టామని, గతేడాది కృష్ణా, గోదావరి నుంచి 6 వేల టీఎంసీలు సముద్రంలోకి వెళ్లాయన్నారు. గోదావరి నీళ్లు వాడుకుంటే నేను ఎప్పుడూ అడ్డుచెప్పలేదన్నారు. విభజన తర్వాత కాళేశ్వరం కట్టినా గోదావరిలో చాలా నీళ్లున్నాయని అభ్యంతరం చెప్పలేదని సీఎం తెలిపారు. గోదావరిపై ఎన్ని ప్రాజెక్టులు కట్టినా ఫర్వాలేదని, రాష్ట్రానికి నీళ్లు వస్తాయని అనుకున్నానని సీఎం తెలిపారు.



# సంపాదకీయం

## ఆధునిక విద్యాభారతి వైతాళికురాలు



మహిళలు, దళితులు, శూద్రులు చదువు పొందకూడదనే కఠినమైన సామాజిక ఆంక్షలు ఉన్న కాలంలో, వాటన్నిటినీ ఛేదించి విద్య మాత్రమే విముక్తికి మార్గమని నిరూపించిన ధైర్యశాలి సావిత్రి బాయి ఫూలే. అణచివేత, అవమానం, అపహాస్యం వంటి ఎన్నో అవరోధాలను ఎదుర్కొం టూ కూడా సమానత్వం,మాన వత్వం, న్యాయం అనే విలువల కోసం ఆమె అలుపెరుగకుండా పోరాడారు. ఆమె దృష్టిలో చదువనేది కుల, లింగ వివక్ష నుంచి విముక్తి పొందే ఆయుధం. ఇలాంటి పోరాటాల ఫలితంగానే బాలికల విద్య, దళితుల చదువు, వితంతువుల జీవితాల్లో వెలుగు మొదలైనాయి. సావిత్రిబాయి ఫూలే కేవలం బోధనకే పరిమితం కాలేదు. అనాథల, వితంతువుల, రోగుల సేవలోనూ పాల్గొని ఉపాధ్యాయ వృత్తికి మానవీయ విలువలను జోడించారు. భారతీయ సమాజంలో అట్టడుగువర్గాల జీవితాల్లో ప్రత్యక్షంగా సంస్కరణలు తీసుకొచ్చిన తొలి వ్యక్తిగా ఆమెను పరిశీలిస్తే, సావిత్రిబాయి ఫూలే నిజమైన మొదటి సంఘసంస్కర్త. సమాజం కోసం జీవించి, సమాజం కోసం మరణించిన వ్యక్తి మాత్రమే అసలైన సంఘసంస్కర్త అవుతారు. ఆ ప్రమాణానికి పూర్తిగా సరిపోయిన తొలి వ్యక్తి ఆమె.సావిత్రిబాయి ఉద్యమం సమగ్ర మానవ విముక్తిని లక్ష్యంగా పెట్టుకుంది. మహిళ, శూద్రుడు, అతిశూద్రుడు అనే భేదాలను ఒక్కరీతిగా ప్రశ్నించిన సంస్కర్త ఆమె. సమకాలీన సంస్కర్తలు సమాజంలోని ఒక్కో అన్యాయాన్ని మాత్రమే ఎదుర్కొంటే, ఆమె మూల వ్యవస్థలనే ప్రశ్నించారు. అందుకే ఆమెను కేవలం ఒక మహిళా సంస్కర్తగా కాకుండా, భారతదేశంలోని అత్యంత విప్లవాత్మక సామాజిక సంస్కర్తగా గుర్తించాలి. నేటి మహిళా ఉపాధ్యాయులకు సావిత్రిబాయి నిజమైన ఆదర్శం. ఆమె ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాక, సమాజ మార్పునకు శక్తిమంతమైన సాధనంగా భావించారు. తీవ్రమైన సామాజిక వ్యతిరేకత, అవమానాలు ఎదురైనా బాలికల విద్య కోసం ధైర్యంగా ముందుకు సాగారు. ఆడపిల్లలకు చదువు అందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్న దూరదృష్టితో బోధించారు. ప్లేగు వ్యాధి తీవ్రంగా వ్యాప్తి చెందుతున్న సమయంలో ఆయా రోగులకు సేవ చేస్తూ ప్రాణాలు కోల్పోవడం ఆమె త్యాగభావానికి పరాకాష్ఠ. నేటి మహిళా ఉపాధ్యాయులంతా సావిత్రిబాయిని ఒక చారిత్రక వ్యక్తిగా మాత్రమే కాక, వృత్తి నిబద్ధతకు, సామాజిక బాధ్యతకు నిదర్శనంగా చూడాలి. ఆమె జీవితాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే ఉపాధ్యాయ వృత్తికి నిజమైన గౌరవం వస్తుంది.సావిత్రిబాయి ఫూలే జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరపడం గౌరవప్రదమైన విషయమే. అయితే ఆమె ఆశయాలు కేవలం సభలు, ప్రసంగాలు, పూలమాలలకే పరిమితమైతే అది ఆమె చేసిన త్యాగానికి న్యాయం చేసి నట్లు కాదు. ఆమె జీవితమంతా ఆచరణాత్మక పోరాటమే; కాబట్టి ఆమెను స్మరించుకోవడం కూడా కార్యాచరణ రూపంలోనే ఉండాలి. మహిళా విద్య, దళిత వెనుకబడిన వర్గాల చదువు, సమానత్వం, ఆత్మగౌరవం. ఇవే సావిత్రిబాయి ప్రధాన లక్ష్యాలు. నేటి కాలంలో కూడా బాలికల డ్రాప్ అవుట్లు, విద్యలో అసమానతలు, సామాజిక వివక్ష కొనసాగుతూనే ఉన్నాయి. వీటిని నిర్మూలించేందుకు నాణ్యమైన ప్రభుత్వ పాఠశాలలు, బాలికలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, పేద విద్యార్థులకు నిరంతర సహాయం వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. విద్యను కేవలం డిగ్రీలకే పరిమితం చేయ కుండా, ప్రశ్నించే చైతన్యం, సామాజిక బాధ్యతను పెంపొందించేలా రూపొందించాలి. అప్పుడే సావిత్రి బాయి ఆలోచనలు సజీవంగా నిలుస్తాయి. అందువల్ల, ప్రభుత్వం సావిత్రిబాయి జయంతిని జరపడం కంటే, ప్రధానంగా ఆమె లక్ష్యాలను కొనసాగించే విధానాలు అమలు చేయడమే నిజమైన నివాళి అవుతుంది.

## అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నివాసంపై కాల్పులు

**మొదటిపేజీ తరువాయి** – ఈ ఘటనలో ఇంటి అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాల్పులు జరిగిన సమయంలో జేడీ వాన్స్ కుటుంబం ఇంట్లో లేదని అమెరికా మీడియా తెలిపింది. నిందితుడు ఎందుకు కాల్పులు జరిపాడన్న దానిపై స్పష్టత లేదు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నివాసం వద్ద సోమవారం తెల్లవారుజామున కలకలం రేగింది. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. సీక్రెట్ సర్వీస్, సిన్సినాటి పోలీసులు సంయుక్తంగా ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.వివరాల్లోకి వెళితే, ఒహాయో రాష్ట్రంలోని సిన్సినాటి నగరంలో సోమవారం అర్ధరాత్రి దాటాక సుమారు 12:15 గంటలకు జేడీ వాన్స్ నివాసం సమీపంలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా పరుగెడుతున్నట్లు సీక్రెట్ సర్వీస్ సిబ్బంది గుర్తించారు. వెంటనే వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఇంటి కిటికీ అద్దాలు పగిలిపోయి ఉండటాన్ని గమనించారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.అయితే, ఈ ఘటన జరిగిన సమయంలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లో లేరని అధికారులు స్పష్టం చేశారు. సెలవుల అనంతరం ఆదివారమే ఆయన వాషింగ్టన్ డీసీకి బయలుదేరి వెళ్లినట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించే ప్రయత్నం చేయలేదని ప్రాథమికంగా భావిస్తున్నారు. అతడు ఉపాధ్యక్షుడిని లక్ష్యంగా చేసుకుని ఈ చర్యకు పాల్పడ్డాడా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనపై వైట్ హౌస్ లేదా సీక్రెట్ సర్వీస్ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## కోనసీమలో ఓఎన్జీసీ సైట్ వద్ద భారీ అగ్నిప్రమాదం

**మొదటిపేజీ తరువాయి** – వేస్తున్నారు.సమాచారం అందుకున్న వెంటనే రెవెన్యూ, పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అధికారులు ముందుజాగ్రత్త చర్యగా ఇరుసుమండ గ్రామాన్ని పూర్తిగా ఖాళీ చేయించారు. చుట్టుపక్కల 5 కిలోమీటర్ల పరిధిలోని ప్రజలను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఓఎన్జీసీ ఉన్నతాధికారులు, సాంకేతిక బృందాలు రాజమండ్రి నుంచి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయి.ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని సీఎం ఆదేశించారు. మంటలను త్వరితగతిన అదుపు చేసేందుకు ఓఎన్జీసీతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఘటనపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని కోరారు. కాగా, ఉత్పత్తిని పెంచే పనుల్లో భాగంగానే ఈ లీకేజీ జరిగి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

## తెలంగాణలో నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణలోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రులను సమూలంగా బలోపేతం చేస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. రాష్ట్రంలో అత్యున్నత వైద్య సేవలందించే నిమ్స్ ఆసుపత్రిపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి చెప్పారు. నిమ్స్‌లో అదనంగా 125 వెంటిలేటర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఖాళీగా ఉన్న 850 ఉద్యోగాలను త్వరలోనే భర్తీ చేస్తామని సభకు హామీ ఇచ్చారు.శాసనసభ వేదికగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి అనుగుణంగా అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,790 వెంటిలేటర్ బెడ్లకు అదనంగా మరో 490 వెంటిలేటర్లను కొనుగోలు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. వీటిని గాంధీ, ఉస్మానియా, ఎంజీఎంతో పాటు జిల్లా ఆసుపత్రుల్లో ఏర్పాటు చేస్తామన్నారు.అలాగే, రోగ నిర్ధారణలో కీలకమైన 9 కొత్త ఎంఆర్ఐ యంత్రాలను వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల పేదలకు ఖరీదైన పరీక్షలు ఉచితంగా అందుబాటులోకి వస్తాయని వివరించారు.అత్యవసర సేవలపైనా ప్రభుత్వం దృష్టి సారించిందని, కొత్త అంబులెన్స్‌ల రాకతో రెస్పాన్స్ సమయం 18 నిమిషాల నుంచి 13 నిమిషాలకు తగ్గిందని మంత్రి తెలిపారు. ఈ ఏడాది మరో 79 అంబులెన్స్‌లను ప్రవేశపెట్టి ఈ సమయాన్ని 10 నిమిషాలకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.డయాలసిస్ రోగుల కోసం ప్రతి 25 కిలోమీటర్లకు ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇకపై బస్తీ దవాఖానాల్లో మందుల కొరత లేకుండా నేరుగా సెంట్రల్ స్టోర్స్ నుంచి సరఫరా చేసేలా కొత్త విధానం తెస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

## తెలంగాణలో మరో 17 మంది మావోయిస్టులు మాత్రమే ఉన్నారు

**మొదటిపేజీ తరువాయి** – గడువు లోపే తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిస్తే పోలీసు శాఖ నుంచి వారికి అవసరమైన సహాయం అందుతుందని ఆయన అన్నారు.

## తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషం కాదు - సమైఖ్యత అవసరం

**మొదటిపేజీ తరువాయి** – గడచిన 40 ఏళ్లుగా 3 వేల టీఎంసీలు గోదావరి నుంచి సముద్రంలోకి పోతున్నాయన్నారు.త్వరలో పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుంది. కృష్ణా-గోదావరి నదుల అనుసంధానం జరుగుతుంది. ప్రపంచంలో తక్కువ నీటి వినియోగం చేసే దేశం మన భారతదేశమే. ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నా గంగా, కావేరి కలవాలి దేశంలో నీటి సమస్య పరిష్కారం కావాలి. ఏపీలో ఉండే నదులన్నీ అనుసంధానం కావాలి. తెలంగాణలో గోదావరి నీళ్లు కూడా వాడుకోవాల్సిన అవసరం ఉంటే వాడుకోవాలి. తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు కాదు, సమైఖ్యత అవసరం.రెండు తెలుగు రాష్ట్రాలు ఒకరినొకరు అర్థం చేసుకుని కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు వివరించారు. ఎంతోమంది త్యాగాలు చేశారని, ఇది రాజకీయ వేదిక కాదని నీటి విషయంలో, సహకారంలో తెలుగువారంతా కలిసి ఉండాలని చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా మనల్ని గుర్తించే ఏకైక భాష తెలుగు భాష అని సీఎం కొనియాడారు.



సాగునీటి ప్రాజెక్టుల బాట పట్టిన సీఎం - గడువులోగా నిర్మాణాల పూర్తిపై సమీక్ష

మరోవైపు రాష్ట్రంలోని సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణ పనుల విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే ఈ నెల 7న పోలవరం పర్యటనకు వెళ్లనున్నారు. ప్రాజెక్టు సందర్శన తో పాటు నిర్మాణ పనుల పురోగతి పైనా క్షేత్రస్థాయిలో సీఎం సమీక్షిస్తారు. అదే రోజు విజయవాడలో సిద్ధార్థ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో సీఎం పాల్గొంటారు.ఇదిలా ఉండగా మరోవైపు ఇటీవల తెలంగాణ ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ పనులు నిలిపివేసిందన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ సర్కార్ తప్పుబట్టింది. తన విన్నపం మేరకు, తనపై గౌరవంతో చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్ నిలిపి వేశారని తెలంగాణ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు అసంబద్ధం అని తెలిపిన సంగతి తెలిసిందే. జగన్ హయాంలో ఎటువంటి అనుమతులు లేకుండా నాటి ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టును చేపట్టిందని వెల్లడించింది. సీమకు రోజుకు 3 టీఎంసీల నీరు అంటూ భారీ ప్రకటనలతో అనుమతులు లేకుండా జగన్ పనులు చేపట్టారని, నాటి సీఎం జగన్ ప్రచారంతో రాయలసీమ లిఫ్ట్ పై తెలంగాణ ప్రభుత్వం కోర్టులో కేసులు వేసిన విషయాన్ని గుర్తు చేసింది.

## వీసీలు కేవలం పరిపాలన అధిపతులు కాదు

**మొదటిపేజీ తరువాయి** – జరిగిన పబ్లిక్ యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల సమీక్షా సమావేశంలో లోకేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.తన పాదయాత్రలో ఎంతో మంది యువతను కలిశానని, సర్టిఫికెట్లు చేతిలో ఉన్నా ఉద్యోగాలు లేక గందరగోళంలో ఉన్నారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే సవాళ్లతో కూడిన విద్యాశాఖను తీసుకున్నానని తెలిపారు. రాష్ట్రంలోని ఉన్నత విద్యలో ప్రధానంగా ఐదు అంశాలపై దృష్టి సారించాలని వీసీలకు దిశానిర్దేశం చేశారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాల్లో మార్పులు తీసుకురావాలని, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్‌లు పెంచి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని సూచించారు."డిగ్రీలు పూర్తిచేసినా ఉద్యోగం రాక మన విద్యార్థులు అమీర్‌పేటలో శిక్షణ పొందితే కానీ ఉద్యోగం సాధించలేకపోతున్నారు. ఇది విద్యార్థుల వైఫల్యం కాదు, మన సంస్థల వైఫల్యం" అని మంత్రి లోకేశ్ అన్నారు. పరిశోధనలు కేవలం ప్రచురణలకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రతి వారం విద్యార్థులతో నేరుగా మాట్లాడేందుకు 'ఓపెన్ హౌస్' నిర్వహించాలని వీసీలను కోరారు. అందరి కృషితో రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను ప్రపంచస్థాయి సంస్థలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు.

**ఉన్నత విద్యలో 5 సవాళ్లు**

ప్రస్తుతం ఉన్నత విద్యారంగం ఐదు ప్రధాన సవాళ్లను ఎదుర్కొంటోందని మంత్రి లోకేశ్ విశ్లేషించారు.

1. బోధన-అవసరాల మధ్య అంతరం: పరిశ్రమల అవసరాలకు, మనం బోధిస్తున్న పాఠ్యాంశాలకు మధ్య తీవ్ర వ్యత్యాసం ఉంది. దీనివల్ల మన డిగ్రీలకు అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గుతోంది. ప్రపంచ ప్రఖ్యాత స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ సైతం ఎప్పటికప్పుడు తమ పాఠ్యాంశాలను పూర్తిగా మారుస్తోందని, మనం కూడా కాలానుగుణంగా సిలబస్‌ను నవీకరించాలని సూచించారు.

2. ఉద్యోగావకాశాలు లేని డిగ్రీలు: ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్ వ్యవస్థలు సరిగా లేకపోవడంతో మన డిగ్రీలకు విశ్వసనీయత కొరవడుతోంది. మన వర్సిటీల నుంచి పట్టభద్రులైన విద్యార్థులు ఉద్యోగాలు సాధించలేకపోతుండగా, అమీర్‌పేటలో నాలుగు నెలల శిక్షణతో ఉద్యోగాలు పొందుతున్నారని, ఇది విద్యార్థుల వైఫల్యం కాదని, మన విద్యాసంస్థల వైఫల్యమని స్పష్టం చేశారు.

3. ప్రయోజనం లేని పరిశోధనలు: పరిశోధనలు కేవలం ప్రచురణలకే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా మారాలి. నీటికొరత, వాతావరణ మార్పులు వంటి సమస్యలకు వర్సిటీలు పరిష్కారాలు చూపాలి.

4. పరిపాలనా భారం: అధ్యాపకులు, వీసీలు బోధన కంటే పరిపాలనపైనే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు. ఈ పాత పద్ధతులు వీడి, అకడమిక్ ప్రమాణాలపై దృష్టి సారించాలి.

5. విద్యార్థుల అనుభవంలో లోపాలు: విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం, మానసిక మద్దతు కొరవడుతోంది. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**భవిష్యత్ కార్యాచరణ ఇదే**



ఈ సవాళ్లను అధిగమించేందుకు పాత పద్ధతులను విడనాడి, విద్యావ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని లోకేశ్ పిలుపునిచ్చారు. రాబోయే పదేళ్లలో రానున్న ఉద్యోగాల్లో 80 శాతం ఇప్పటికి తెలియని రంగాల్లోనే ఉంటాయని, అందుకు తగ్గట్టుగా యువతను సిద్ధం చేయాలన్నారు. పరిశ్రమలతో అనుసంధానం పెంచి, ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లను తప్పనిసరి చేయాలన్నారు. వర్సిటీలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను వినియోగించుకోవాలని, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇందుకు చక్కటి ఉదాహరణ అని తెలిపారు. ఈ సమావేశంలో హెచ్ఆర్‌డీ కార్యదర్శి కోన శశిధర్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.మధుమూర్తి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ పాల్గొన్నారు.

## మాతృభాష మన మూలాలకు సంకేతం

**మొదటిపేజీ తరువాయి** –

వివిధ కళాప్రక్రియలతో మూడో ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన వేదిక ప్రేక్షకులను మురిపిస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు, సామాజిక నాటకాలు, జానపద నృత్యాలు అలరిస్తున్నాయి. ప్రపంచ తెలుగు మహాసభల మూడో రోజు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగు భాషకు దేశంలోనే ఘనమైన చరిత్ర ఉందని అన్నారు.ఇలాంటి మహాసభలు తెలుగు భాష పరిరక్షణకు ఉపయోగపడతాయన్నారు. మాతృభాషలో రాణిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తామన్నారు. త్యాగధనులను గుర్తు పెట్టుకుంటే స్ఫూర్తిదాయకంగా ఉంటుందని, నందమూరి తారక రామారావు ఆత్మగౌరవంతో ముందుకెళ్లారని, తెలుగు జాతి ఉన్నంతవరకు గుర్తుపెట్టుకునే ఏకైక నాయకుడు ఎన్టీఆర్ అని సీఎం కొనియాడారు.మాతృభాష మన మూలాలకు సంకేతమన్న సీఎం, అంగ్లం అవసరం కానీ భాషను మరచిపోతే మనల్ని మనమే కోల్పోయినట్లు అవుతుందన్నారు. టెక్నాలజీ వల్ల భాష కనుమరుగవుతుందన్నారు.టెక్నాలజీతో భాషను సులువుగా కాపాడుకోవచ్చుని, కొత్త యాప్‌లు వచ్చాయని తెలుగులో మాట్లాడితే తెలుగులోనే సమాధానమిస్తాయని పేర్కొన్నారు. కనీసం టైప్ చేయడానికి తెలియనివాళ్లు కూడా ఈ టెక్నాలజీ ఉపయోగించుకునే పరిస్థితి వస్తుందన్నారు. పొట్టిశ్రీరాములు పేరుతో 1985లోనే ఎన్టీఆర్ తెలుగు వర్సిటీ తీసుకొచ్చారన్నారు. విభజన తర్వాత రాజమండ్రిలో పొట్టిశ్రీరాములు తెలుగు వర్సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు.సంక్రాంతి కంటే ముందు వచ్చిన పండుగ ఇదని, వేదికకు తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన ఎన్టీఆర్ పేరు పెట్టడం సంతోషదాయకమని సీఎం హర్షం వ్యక్తం చేశారు. దేశంలోనే తెలుగు భాషకు ఘనమైన చరిత్ర ఉందని, వందలాది భాషలు ఉన్నా మన దేశంలో కేవలం ఆరు భాషలకు ప్రాచీన హోదా లభించిందన్నారు. ప్రాచీన హోదా లభించిన భాషల్లో తెలుగు ఉండటం మనందరికీ గర్వకారణమని, హిందీ, బెంగాలీ, మరాఠీ తర్వాత దేశంలో ఎక్కువ మాట్లాడే భాష తెలుగు అని, ప్రపంచం మొత్తంలో సుమారు 10 కోట్లమంది తెలుగు మాట్లాడుతున్నారని చంద్రబాబు వివరించారు.'ఈ మహాసభలకు దాదాపు 40 దేశాల నుంచి ప్రతినిధులు వచ్చారు. ఇలాంటి మహాసభలు తెలుగు భాష పరిరక్షణకు ఉపయోగపడతాయి. గిడుగు వెంకట రామ్మూర్తిని తెలుగు జాతి ఎప్పటికీ మరవలేదు. నేను తెలుగువాణ్ని, నాది తెలుగుదేశం అని చాటిచెప్పిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్. తెలుగు భాషాభివృద్ధికి కృషిచేస్తున్నవారికి, ప్రతిభ చూపిన వారికి పూర్ణకుంభ వంటి అవార్డులు ఇచ్చారు. 1949లో హైదరాబాద్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్‌గా ఎదిగింది. 2017లో ఆంధ్ర సారస్వత పరిషత్‌కు మళ్లీ ఊపిరిపోశారు. 2022లో భీమవరంలో, 2024లో రాజమండ్రిలో మహాసభలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నేతలు తెలుగు భాష కీర్తిని వివరిస్తూ తమదైన శైలిలో ప్రసంగించారు. పిల్లలు తెలుగు మాట్లాడేలా తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలని శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు కోరారు. మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొన్న ఆయన తెలుగుభాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షణకు అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రాచీనకళలు కాపాడేం దుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.2 వేల సంవత్సరాల చరిత్ర కలిగిన భాష మన తెలుగు అని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గుంటూరులో జరుగుతున్న మూడో ప్రపంచ తెలుగు మహా సభల్లో ఆయన పాల్గొన్నారు. ఇలాంటి సభలు తెలుగు భాష ఉనికిని కాపాడుతాయని, ఔన్నత్యాన్ని చాటి చెబుతాయని వివరించారు.తరతరాల మధ్య కుటుంబ బంధాలను భాష బలపరుస్తుందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొన్న ఆయన తెలుగు భాష పరిరక్షణకు అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆంగ్లం నేర్చుకోవడం తప్పుకాదు తెలుగు మరచిపోవడం తప్పేనని కేంద్రమంత్రి పెమ్మసాని వ్యాఖ్యానించారు.

## వెనెజువెలా అధ్యక్షుడికి పుట్టపర్తితో బలమైన బంధం

**మొదటిపేజీ తరువాయి** – ఇటీవలే అమెరికా దళాలకు పట్టుబడిన వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకు ఏపీతో ఒక బలమైన ఆధ్యాత్మిక అనుబంధం ఉంది. ప్రపంచవ్యాప్తంగా నియంతగా ముద్రపడిన మదురో, పుట్టపర్తి సత్యసాయి బాబాకు వీరాభిమాని కావడం చాలామందికి తెలియని విషయం. క్యాథలిక్‌గా పెరిగినప్పటికీ, మదురోకు తన భార్య సిలియా ఫ్లోర్స్ ద్వారా భారతీయ ఆధ్యాత్మిక గురువు సత్యసాయి బాబా పరిచయమయ్యారు. వారిద్దరూ సాయిబాబా అనుచరులుగా మారి, 2005లో పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని సందర్శించి, సత్యసాయి బాబాతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ సమయంలో బాబాతో పాటు వారు నేలపై కూర్చున్న ఫొటో కూడా ఉంది.మదురో అధికారంలోకి వచ్చాక కూడా ఈ ప్రభావం కొనసాగింది. ఆయన తన కార్యాలయంలో సాయిబాబా చిత్రపటాన్ని ప్రముఖంగా ఉంచుకునేవారని కథనాలున్నాయి. 2011లో సాయిబాబా




మరణించినప్పుడు, అప్పటి విదేశాంగ మంత్రిగా ఉన్న మదురో చొరవతో వెనెజువెలా జాతీయ అసెంబ్లీ సంతాప తీర్మానం చేసింది. దేశంలో ఒకరోజు జాతీయ సంతాప దినంగా ప్రకటించి, బాబా ఆధ్యాత్మిక సేవలను గుర్తించింది.మదురో పాలనలో చాలా విదేశీ సంస్థలు వెనిజులాను విడిచి వెళ్లినా, సత్యసాయి సంస్థ కార్యకలాపాలు మాత్రం నిరాటంకంగా కొనసాగాయి. 2025 నవంబర్‌లో పట్టుబడటానికి కేవలం కొన్ని నెలల ముందు కూడా సాయిబాబా శతజయంతి సందర్భంగా ఆయనను స్మరించుకున్నారు. బాబాను 'జ్యోతిర్మయ స్వరూపుడు' అని అభివర్ణించారు. "మేము కలిసినప్పుడు నేను ఆయనను ఎప్పుడూ గుర్తుంచుకుంటాను... ఆ గొప్ప గురువు జ్ఞానం మనల్ని నిరంతరం ప్రకాశవంతం చేయాలి" అని ఆయన పేర్కొన్నారు. రాజకీయంగా ఎన్ని ఒడిదొడుకులు ఎదుర్కొన్నప్పటికీ, పుట్టపర్తితో, సాయిబాబాతో మదురోకున్న ఆధ్యాత్మిక బంధం చివరి వరకూ కొనసాగడం గమనార్హం.

## వ్యక్తిగా వెళుతున్నా... రాజకీయ శక్తిగా తిరిగి వస్తా

**మొదటిపేజీ తరువాయి** – రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని ఆమె ఆరోపించారు.రాష్ట్రంలో ఒక కొత్త రాజకీయ వేదిక రాబోతుందని, విద్యార్థులు, నిరుద్యోగులు, అన్ని వర్గాల కోసం తాను పనిచేస్తానని హామీ ఇచ్చారు. "అవమాన భారంతో పుట్టింటి నుంచి అన్ని బంధనాలు తెంచుకుని మీకోసం వస్తున్నా.. ఆశీర్వదించండి. తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారుతుంది" అని ఆమె పేర్కొన్నారు.సభ నుంచి బయటకు వచ్చాక కవిత మీడియాతో మాట్లాడారు. ఉద్యమకారుల కోసం, వారి ఆశయాల కోసం తెలంగాణ జాగృతి పార్టీ పనిచేస్తుందని అన్నారు. ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానిస్తున్నానని ఆమె అన్నారు. అవినీతి, రైతుల మీద కేసులు, బీఆర్ఎస్ సొంత నాయకులపై కేసులు, ఇంకా మరెన్నో బీఆర్ఎస్‌లో జరిగిన అక్రమాల గురించి తాను అధినాయకత్వం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని అన్నారు.కుట్రదారులు, తెలంగాణ ద్రోహులు గెలిచారని మండిపడ్డారు. కానీ బీఆర్ఎస్ కోసం కడుపు కట్టుకుని పని చేసిన ఏ నాయకుడు ఉండలేకపోయారని అన్నారు. తాను ఊరుకునే వ్యక్తిని కాదని, కొట్లాడే ఆడబిడ్డనని అన్నారు. నాడు బీఆర్ఎస్ పార్టీ చేసిన అన్యాయాన్ని నేడు కాంగ్రెస్ కూడా కొనసాగిస్తోందని ఆరోపించారు. అందుకే తెలంగాణలో ఒక రాజకీయ వేదిక అవసరమని, తెలంగాణ జాగృతి ఆ ఖాళీని పూర్తి చేస్తుందని అన్నారు.ఒక ఆడబిడ్డగా మీ ముందుకు వస్తున్న తనను



ఆదరించమని ఆమె కోరారు. ఎప్పుడైనా కొత్త రాజకీయ శక్తి వస్తున్నప్పుడు ఇష్టారీతిన ఆరోపణలు చేయడం సహజమే అన్నారు. తాను బీఆర్ఎస్‌లో వాటాలు కుదరక బయటకు వచ్చానని కాంగ్రెస్ అంటోందని, తనతో కాంగ్రెస్ మాట్లాడుతోందని బీఆర్ఎస్ చెబుతోందని, కానీ ఆ వాదనల్లో వాస్తవం లేదని అన్నారు. తనకు దైవభీతి ఎక్కువ అని, లక్ష్మీనరసింహస్వామి మీద ప్రమాణం చేసి చెబుతున్నానని, తనది ఆస్తుల పంచాయితీ కాదని, రాజకీయ పంచాయితీ అని అన్నారు. తాను బీసీల గురించి, అవినీతి గురించి మాట్లాడానని గుర్తు చేశారు. మండలి ఛైర్మన్ తన రాజీనామాను ఆమోదిస్తే ప్రజల కోసం పూర్తిగా పోరాడతానని అన్నారు.

# భీమదేవరపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా కేతిరి లక్ష్మారెడ్డి

## సమిష్టి అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తాం



**భీమదేవరపల్లి, డిసెంబర్ 5 (ప్రజా మంటలు) :** మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన ఏకగ్రీవ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డిని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముస్తఫాపూర్‌లోని బీఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా కేతిరి లక్ష్మారెడ్డిని గొల్లపల్లి సర్పంచ్ నేతుల చంద్ర మోహన్ ప్రతిపాదించగా, మాణిక్యాపూర్ సర్పంచ్ ముద్దసాని మమత సదానందం బలపరిచారు. సమావేశానికి హాజరైన సర్పంచులు చప్పట్లతో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులుగా గద్ద కుమారస్వామి యాదవ్, బోయినీ మహేష్, గజ్జల సృజన రమేష్, గుగులోతు పూర్ణిమ రాజు నాయక్, ప్రధాన కార్యదర్శిగా శిక ప్రదీప్, సంయుక్త కార్యదర్శిగా నేతుల చంద్రమోహన్, కార్యదర్శులుగా బొల్లంపల్లి అజయ్ కుమార్, కొర్ర గోపాల్, వంగ తిరుమల సురేష్ గౌడ్, మండల రజిత మహేష్, కోశాధికారిగా డప్పు శ్రీనివాస్ లను ఎంపిక చేశారు. కార్యవర్గ సభ్యులుగా గద్దం సుజాత, రఘుపతి రెడ్డి, వూరడి భారతి జైపాల్ రెడ్డి, గూడెల్లి కల్పన తిరుపతిరెడ్డి, భూక్య సునీత, మణికంఠ, ముద్దసాని మమత సదానందం, సిద్ధమల్ల రమా రమేష్, మేకల వెంకన్న, బొల్లి మానస ప్రశాంత్ గౌడ్, గోపగాని తిరుపతి గౌడ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చిట్టెంపెల్లి ఐలయ్య, మాజీ ఎంపీపీ బొజ్జపురి అశోక్ ముఖర్జీ, కొలుగురి రాజు, మంగ రామచంద్రం, ఆదరి రవీందర్, ఊస కోయిల ప్రకాష్, డబ్బా శంకర్, పిడిశెట్టి కనకయ్య, మాడుగుల గోపి, కంకల సమ్మయ్య, మాడుల చింటూ తదితరులు హాజరయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన కేతిరి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, సహకారంతో భీమదేవరపల్లి మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి కోసం సమిష్టి కృషితో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సర్పంచులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డితో పాటు నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించారు.

# అగ్రవర్ణ పేదలకు సంక్షేమ పథకాలు అందజేయాలి

## జనాభా ప్రాతిపధికన రిజర్వేషన్లు కల్పించాలి

## ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారిలో అలసత్వం వద్దు

## ప్రజావాణిలో కలెక్టర్ కు ఓసి జేఏసీ నాయకుల వినతి





**జగిత్యాల జనవరి 5 (ప్రజా మంటలు) :** అగ్ర వర్ణాలోని పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలనీ ఓసి జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు ఓ.సి.జెఏసీ నాయకులు ఓ.సి వర్గాలకు సంబంధించిన పలు డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని సోమవారం ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు.ఈనెల 11 న వరంగల్ లో నిర్వహించనున్న ఓసి ల సింహ గర్జన సభను విజయవంతం చేయాలనీ కోరుతూ జగిత్యాల వైశ్య భవన్ లో ఓసి నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించి అనంతరం నాయకులు కలెక్టరెట్ కు వెళ్లి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఓసి జేఏసీ నాయకులు ఎన్నం కిషన్ రెడ్డి, అయిల్నేని సాగర్ రావు, మహంకాళి రాజన్న, సిరిసిల్ల రాజేందర్ శర్మలు మాట్లాడుతూ రాష్ట్ర ,జాతీయ స్థాయిలో ఓ.సి కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు.ఓ.సి వర్గాలకు జనాభా ప్రాతిపదికన ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించడమే కాకుండా జనరల్ స్థానాల్లో ఓసి అభ్యర్థులే పోటీచేసేలా రాజ్యాంగ సవరణ చేయాలనీ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ డబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఓసిల్లోని ప్రతి విద్యార్థికి విద్య, ఉద్యోగాల్లో సహాయం పడేలా ఉండాలన్నారు.ఓ.సి వర్గాలకు చెందిన 10 శాతం ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్ల జారిలో జగిత్యాల జిల్లాలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని, నిబంధనల మేరకు వెంటనే జారీ చేయాలనీ కలెక్టర్ ను కోరారు.సమావేశంలో నాయకులు దేవరాశెట్టి జనార్దన్,మోతే ఉమాపతి శర్మ, ప్రసాద్ రావు, బంద పెల్లి చంద్రశేఖర్, రేణికుంట శ్రీనివాస్, అక్కెనపల్లి కాశినాథం, అయిల్నేని స్వప్న, వెంకటేశ్వర్ రావు, సిరిసిల్ల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలి

## కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాలు

## కొత్తకొండ వీరభద్రస్వామి జాతర ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష





**భీమదేవరపల్లి, జనవరి 5 (ప్రజా మంటలు) :** శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం కొత్తకొండలో 2026 సంవత్సరానికి నిర్వహించనున్న వార్షిక జాతర ఏర్పాట్లపై హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధ్యక్షతన సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతర సమీపిస్తున్న నేపథ్యంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఇప్పటికే చేసిన ఏర్పాట్లు, ఇంకా చేయాల్సిన పనులపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టర్ సమగ్రంగా రివ్యూ చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం తరపున చేపట్టనున్న ఏర్పాట్ల వివరాలను వరంగల్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రామాల సునీత కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా కొత్తకొండకు వచ్చే మార్గాల్లో గుంతల పూడ్చివేత, రహదారుల మరమ్మతులు, విస్తృత పార్కింగ్ స్థలాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు. జాతరకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతంగా నిర్వహించాలని, భద్రత, వైద్య, అగ్నిమాపక, పారిశుద్ధ్యం, త్రాగునీరు, విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వరంగల్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రామాల సునీత, కొత్తకొండ గ్రామ సర్పంచ్ రమ రమేష్, ఎస్ఐ రాజు, ఎంపీడీవో వీరేశం, ఎంపీవో నాగరాజు, ఎంఆర్వో రాజేష్, మెడికల్ ఆఫీసర్ జ్యోతి, ఫైర్ అధికారి సుదర్శన్ రెడ్డి, ఆలయ ఉప ప్రధాన అర్చకులు రాజయ్యతో పాటు దేవస్థాన సిబ్బంది రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యం కోసం లక్ష సైన్యాన్ని తయారు చేస్తాం

## మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తాం

## ఆనాటి బీఆర్ఎస్ కన్నా కాంగ్రెస్ ఇంకా అధ్వాన్నంగా మారింది

## మీడియాతో రాష్ట్రీయ లోక్ దళ్ స్టేట్ చీఫ్ కపిలవాయి దిలీప్ కుమార్




**సికింద్రాబాద్, జనవరి 05 ( ప్రజామంటలు) :** నిరుద్యోగులకు కార్పొరేట్ ఉద్యోగాలు, రైతులు, తదితర సమస్యల పరిష్కారానికి తమ పార్టీ తరపున లక్షమంది యువతతో ఒక సైన్యాన్ని తయారుచేస్తామని తెలంగాణ స్టేట్ రాష్ట్రీయ లోక్దళ్ ప్రెసిడెంట్ కపిలవాయి దిలీప్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన కవాడిగూడ లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ...లక్ష్యం కోసం లక్ష సైన్యం అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, ఇందుకు గాను లక్ష మంది యువతను నియమించి, రిటైర్డ్ ఆర్మీ అధికారుల ద్వారా శిక్షణ ఇప్పిస్తామన్నారు. శిక్షణలో శారీరక దృఢత్వం, మానసిక బలం, క్రమశిక్షణ, సమాజంలో , జీవితంలో ఎదురయ్యే సంక్షోబాలను ఎదుర్కొనే విధానాలను నేర్పిస్తామన్నారు. రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ జాబ్ మేళాలు, స్కిల్ మేళాలు, లోన్ మేళాలు నిర్వహించడంలో ముందుంటుందన్నారు. ఈ మేరకు వచ్చే రెండేళ్ళలో ఉపాధి అవకాశాలు, నైపుణ్య శిక్షణ, స్వంత పరిశ్రమల స్థాపించుకునేందుకు రుణ సదుపాయాలు కల్పిస్తామని దిలీప్ కుమార్ వివరించారు. ఇప్పటికే తాము జాబ్ మేళాలను నిర్వహించి, వేలాది మంది యువతకు ప్రముఖ కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పించామన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్ కన్నా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అధ్వాన్నంగా మారిందన్నారు. గతంలో ఒక కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుందని, ఇప్పుడు కనీసం ఐదుగురు కాంగ్రెస్ నాయకులు బహిరంగంగా దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రస్తుతం అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ ను అసహ్యించుకుంటున్నారని, కాని రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ ఖాళీని బీజేపీ వినియోగించుకోలేక పోయిందన్నరాఉ. ఆ ఖాళీని స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి రాష్ట్రీయ లోక్ దళ్ పూరిస్తుందన్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పలు గ్రామాల్లో తమ పార్టీ సర్పంచ్ లు గెలిచారని, రాబోవు ఎంపీటీసీ, జడ్పీటీసీ , మున్సిపల్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో తాము పోటీ చేస్తామన్నరాఉ. ఇటీవల నూతనంగా టీఆర్ఎల్డీ పొలిట్ బ్యూరో చైర్మన్ వీవీ సత్యనారాయణ, తెలంగాణ యూత్ వింగ్ అధ్యక్షుడిగా రాజ్ కుమార్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ గా కృష్ణ విక్రమ్ లను నియమించినట్లు కపిలవాయి దిలీప్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కొత్తగా నియమితులైన పదాధికారులతో పాటు వైస్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, గిరి కుండే, విశాల్, అధికార ప్రతినిధి బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు అభివృద్ధిపై రవిశంకర్ ఆరోపణలు అబద్ధం : ముత్యం శంకర్ గౌడ్



**కొండగట్టు, జనవరి 05 (ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయ అభివృద్ధి విషయంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్ అన్నారు. కొండగట్టు ఆలయ వై జంక్షన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ,కొండగట్టు గుడికి వచ్చే భక్తుల కోసం కనీస సౌకర్యాలు కూడా కల్పించలేని వ్యక్తి, ఆలయ అభివృద్ధి అంతా తానే చేశానని చెప్పుకోవడం సిగ్గుచేటని ముత్యం శంకర్ గౌడ్ విమర్శించారు. రెండు కోట్ల రూపాయలతో చేసిన పనిని అభివృద్ధిగా చెప్పడం సరికాదని, అది కేవలం ఆదునీకరణ మాత్రమేనని అన్నారు. కొండగట్టులో ఇసుకంత అభివృద్ధి కూడా జరగలేదని ఆరోపించారు.ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవతోనే కొండగట్టు అభివృద్ధికి నిధులు వస్తున్నాయని తెలిపారు. టీటీడీ నిధులకు సహకరించిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కొండగట్టుకు వస్తే ఎమ్మెల్యే సత్యంకు మంచి పేరు వస్తుందన్న అసూయతోనే రవిశంకర్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.2024 లోనే కొండగట్టు అభివృద్ధిపై ఎమ్మెల్యే సత్యం అధికారికంగా లేఖ రాశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కోసం ఎన్నోసార్లు ధర్నాలు నిర్వహించామని తెలిపారు. రవిశంకర్ చెప్పిన రూ.100 కోట్ల అభివృద్ధి మాటలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు.ఎమ్మెల్యే సత్యం నాయకత్వంలో డిగ్రీ కళాశాల, చొప్పదండిలో ఇంటిగ్రేటెడ్ స్కూలు, అడ్వాన్స్ టెక్నాలజీ ఏటీసీ సెంటర్ తీసుకువచ్చామని, అభివృద్ధి చేయకుండా ఎమ్మెల్యేపై అనవసర ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సతీష్ రెడ్డి, కొడిమ్యాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజుల అజయ్ గౌడ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శ్రీకోటి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు గోల్కొండ రాజు, నాయకులు దగ్గు మహేష్, జలంధర్, నక్క అనిల్, జమలపురి నిఖిల్, గుర్రం విజయ్, బక్కశెట్టి శ్రీనివాస్, సొంత ప్రకాష్ రెడ్డి, కోరేపు వెంకటేష్, కొత్తకొండ శ్రీనివాస్, పృథ్వీరాజ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు గిరిప్రదక్షిణ కొరకు రోడ్డు పరిశీలన

## అరుణాచలం, సింహాచలం తరహాలో గిరిప్రదక్షిణ ఏర్పాట్లకు

## ప్రణాళిక రూపకల్పన - జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**మల్యాల జనవరి 5 (ప్రజామంటలు) :** ప్రభుత్వ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం ప్రాంతంలో భక్తులు గిరిప్రదక్షిణ చేయడానికి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సోమవారం కొండగట్టు లోని రోడ్డు మార్గాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూకొండగట్టు ఆలయం చుట్టూ భక్తులు గిరిప్రదక్షిణ చేయడానికి కావాల్సిన ఏర్పాట్ల గురించి రెవిన్యూ, ఫారెస్ట్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ మరియు సంబంధిత అధికారులతో పరిశీలించడం జరిగిందని తెలిపారు.గిరిప్రదక్షిణ కొరకు ముఖ్యంగా రోడ్డు విస్తారంగా ఉండాలని మార్గ మధ్యలో భక్తులకు త్రాగునీరు, శౌచాలయాలు, విశ్రాంత కేంద్రాలు మరియు తదితర అంశాల గురించి సంబంధిత అధికారులకు సూచించడం జరిగిందని తెలిపారు.అలాగే గిరిప్రదక్షిణ కొరకు అంచనా ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అరుణాచలం, సింహాచలం తరహాలో గిరిప్రదక్షిణ ఏర్పాట్ల కు ప్రణాళిక చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఇందుకుగాను దాదాపు 40 ఫీట్ల రోడ్డు వెడల్పు పనులు, విద్యుత్ దీపాలు, అటవీ శాఖ అనుమతుల గురించి మరియు పనుల అంచనా వ్యయాల గురించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు.ఈ పరిశీలనలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్, జిల్లా అటవీ శాఖ అధికారి మాదాసు రవి ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, కొండగట్టు ఈ.వో శ్రీకాంత్ రావు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# సొంత ఖర్చులతో వీధి దీపాలు ఏర్పాటు

## 1వ వార్డు సభ్యురాలు ఎన్న అనూష సురేందర్



**భీమదేవరపల్లి, జనవరి 5 (ప్రజా మంటలు) :** మండలంలోని రత్నగిరి గ్రామంలో 1వ వార్డు పరిధిలో వీధి దీపాల లేమితో రాత్రివేళ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని గమనించిన వార్డు సభ్యురాలు ఎన్న అనూష సురేందర్ స్వయంగా ముందుకొచ్చారు. ప్రభుత్వ నిధులు అందుబాటులో లేని నేపథ్యంలో, సొంత ఖర్చులతోనే వీధి దీపాలను ఏర్పాటు చేసి ప్రజలకు భద్రత కల్పించారు. ఈ దీపాల ఏర్పాటుతో రాత్రి వేళ దారిపై వెలుతురు పెరిగి, వృద్ధులు, మహిళలు, విద్యార్థులకు సురక్షితంగా ఉందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే దొంగతనాలు, ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ స్వయంకృషితో పరిష్కారం చూపిన ఎన్న అనూష సురేందర్‌ను గ్రామ ప్రజలు అభినందించారు. ఇలాంటి సేవా దృక్పథం ఇతర ప్రజాప్రతినిధులకు ఆదర్శమని వారు పేర్కొన్నారు.

# బస్వారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

## శ్రద్ధాంజలి ఘటించిన అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి



**భీమదేవరపల్లి జనవరి 5 (ప్రజా మంటలు) :** మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన బర్రె బస్వారెడ్డి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుబూతిని తెలుపుతూ, వారి మృతి కి గల కారణాలను తెలుసు కొని వారి కుటుంబాన్ని ఓదార్చారు. బస్వారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడు వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని ప్రసాదించాలని అన్నారు.

# సంక్రాంతి సంబరాల్లో ముత్తారంలో రంగవల్లుల పోటీలు

## విజేతలకు బహుమతులు అందజేసిన సర్పంచ్ ఊరడి భారతి



**భీమదేవరపల్లి, జనవరి 5 (ప్రజా మంటలు) :** మండలంలోని ముత్తారం గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రంగవల్లుల (ముగ్గుల) పోటీలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ మాట్ల హరికుమార్, పంచాయతీ సెక్రెటరీ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ కళా ప్రతిభను చాటారు. రంగురంగుల ముగ్గులతో శోభిల్లగా, పండుగ వాతావరణం నెలకొంది. పోటీల్లో పాల్గొన్న మహిళలకు న్యాయనిర్ణేతలు ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, సంప్రదాయ సంస్కృతి పరిరక్షణలో మహిళల పాత్ర అమూల్యమని, ఇలాంటి కార్యక్రమాలు గ్రామ ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు.

# బొల్లోనిపల్లి గ్రామ అభివృద్ధికి సహకరిస్తా

## కావేరి సీడ్స్ అధినేత గుండవరపు భాస్కరరావు



**భీమదేవరపల్లి జనవరి 5 (ప్రజా మంటలు) :** బొల్లోనిపల్లి గ్రామస్తులు సోమవారం హైదరాబాద్‌లోని కావేరి సీడ్స్ ప్రధాన కార్యాలయంలో సంస్థ అధినేత గుండవరపు భాస్కరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం తప్పకుండా అందిస్తానని భాస్కరరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు గోనెల సంపత్, అరకాల రాజు, పొన్నం వనజ రాజు, ఉప సర్పంచ్ బొల్లి సుమన్, వార్డు సభ్యులు గోనెల అక్షిత, బొల్లి కిషోర్, కొత్తగట్టు మౌనిక, బొల్లి ఊర్మిళ, సన్నీల రవి, బొల్లి కుమార్, ఎర్ర మానస, గ్రామ పెద్దలు బొల్లి బుచ్చయ్య, తొర్రి కొమురయ్య, జల చంద్రమౌళి, వడ్లకొండ సంపత్, జక్కరాజు గోవిందరావు, పోల్సాని గోపాలరావు, సన్నిళ్ళ కొమురయ్య, గోనెల వెంకటేష్, ఆసరి కుమార్, వడ్లకొండ సంపత్, గోనెల శ్రీనివాస్, కొత్తగట్టు కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కట్కాపూర్ గ్రామంలో హనుమాన్ 21వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా



**రాయకల్ జనవరి 05 (ప్రజా మంటలు) :** కట్కాపూర్ గ్రామంలో శ్రీ అంజనేయ స్వామి 21వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తండోపతండాలుగా తరలివచ్చి స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా హనుమంతుడికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేసి భక్తుల చేతుల మీదుగా ఆరాధనలు నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాల మధ్య ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది.అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, యువత కీలక పాత్ర పోషించారు.

# జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన మెట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యులు



**జగిత్యాల జనవరి 05 (ప్రజా మంటలు) :** మెట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. రత్న పద్మావతిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కోర్టు సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేసి నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, కోశాధికారి పడిగేల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి గజేల్లి రామ్ దాస్, క్రీడా కార్యదర్శి బిగుల్లా శంకర్‌తో పాటు కార్యవర్గ సభ్యులు గజభీంకర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా న్యాయవ్యవస్థ పట్ల గౌరవం, ఐక్యతను చాటుతూ కార్యక్రమం సౌహార్ద వాతావరణంలో ముగిసింది.

# పేద ఉద్యమ కళాకారుల జీవితాల్లో కొత్త వెలుగు

## సినీ కళాకారుడు కనకం వెంకట్



**భీమదేవరపల్లి, జనవరి 5 (ప్రజా మంటలు) :** తెలంగాణ ఉద్యమ సమయంలో సేవలందించి నిరుద్యోగులుగా మిగిలిపోయిన పేద ధూంధాం కళాకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేసిందని ధూంధాం నిరుద్యోగ కళాకారుడు కనకం వెంకట్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం జీవో ప్రవేశపెట్టి బిల్లు పాస్ చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, చైర్మన్ వెన్నెల గద్దర్ లతో పాటు అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఉద్యమ కళాకారులు కవి,గాయకుడు నేర్నాల కిషోర్కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# భర్తకు గుండెపోటని గుండెలవిసేలా రోదించింది

**ట్విస్ట్ తెలిసి విస్తుపోయిన గ్రామస్థులుతన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను చంపేందుకు భార్య ప్లాన్**

**ఒకసారి విఫలమైన హత్యాయత్నం**

**భర్తను చంపి గుండెపోటుతో మరణించాడని నమ్మించే ప్రయత్నం**

**తమ్ముడి అనుమానంతో బయటపడ్డ నిజాలు**




భర్త గుండెపోటుతో మరణించాడని అందరికీ చెప్పి, గుండెలు పగిలేల రోదించింది. అంత బాధలోనూ చాలా హడావిడిగా అంత్యక్రియలు పూర్తి చేసింది. 'ఒంటరిగా ముగ్గురు పిల్లలను ఎలా పెంచిపోషిస్తుందో' అని చూసిన వారంతా ఆందోళన వ్యక్తం చేశారు. కానీ ఇజ్రాయెల్‌లో ఉన్న మృతుడి తమ్ముడికి అనుమానం రావడంతో ఆమె బండారం మొత్తం బయటపడింది. ప్రియుడితో కలిసి భర్తను దారుణంగా హతమార్చి, అందరి ముందు నాటకమాడినట్లు పోలీసులు తేల్చడంతో గ్రామస్థులు విస్తుపోయారు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం బోర్గాం(కే) గ్రామానికి చెందిన పల్లాటి రమేశ్ (35), సౌమ్య (అరుణ లత) దంపతులకు 13 ఏళ్ల క్రితం వివాహం అయింది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గత నెల (డిసెంబర్) 20న రమేశ్ ఇంట్లో గుండెపోటుతో మరణించాడని సౌమ్య బంధువులందరికీ చెప్పి, నమ్మించింది. అంతేకాకుండా వెంటనే అంత్యక్రియలు కూడా పూర్తి చేయించింది. కానీ రమేశ్ మెడపై గాట్లు ఉన్నట్లు కొందరు స్థానికులు గుర్తించారు. ఆ విషయాన్ని ఇజ్రాయెల్‌లో ఉన్న అతని తమ్ముడు కేదారికి చెప్పారు. ఈ మేరకు మాక్లూర్ పోలీసులకు గత నెల 21న ఫోన్ చేసి తన సోదరుడి మరణంపై అనుమానాలున్నాయని కేదారి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు 24న మృతదేహాన్ని వెలికి తీసి, పోస్టుమార్టం నిర్వహించడంతో హత్యగా తేలింది. సౌమ్యను అదుపులోకి తీసుకొని విచారించగా తానే హత్య చేసినట్లు అంగీకరించింది. తన ప్రియుడు, ఓ సుపారీ గ్యాంగ్‌తో కలిసి ఈ హత్య చేసినట్లు తెలిపింది. సౌమ్య నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాన్ టీచింగ్ స్టాఫ్‌గా పని చేస్తున్నారు. అక్కడే పని చేస్తున్న పీఈటీ, నందిపేట్ మండలం బాద్గుణకు చెందిన నాలేశ్వర్ దిలీప్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం క్రమంగా వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయం రమేశ్‌కు తెలిసి భార్యతో గొడవపడ్డారు. దాంతో పిల్లల గురించి కూడా ఆలోచించకుండా, ప్రియుడితో కలిసి భర్తను అడ్డుతొలగించుకోవాలని ప్రణాళిక వేసింది. గతేడాది ఆగస్టులో రమేశ్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ప్లాన్ ప్రకారం దిలీప్ కారుతో ఢీకొట్టాడు. అదృష్టం కొద్దీ రమేశ్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రయత్నం విఫలం కావడంతో సౌమ్య తన బంగారు ఉంగరాన్ని రూ.35 వేలకు విక్రయించి సుపారీ గ్యాంగ్‌తో చంపించేందుకు పథకం రచించింది. అందులో భాగంగా గత నెల 19న రమేశ్‌కు మంచి నీటిలో 10 నిద్రమాత్రలు కలిపి తాగించింది. దాంతో మృతుడు మెల్లగా నిద్రలోకి జారుకున్నారు. అనంతరం సుపారీ గ్యాంగ్‌ను పిలిపించి వారితో చంపించాలని ప్రయత్నించగా వారు ఫోన్‌లో స్పందించలేదు. ఈ విషయం తెలుసుకున్న దిలీప్ ఇక చేసేదేమీ లేక తన తమ్ముడు అభిషేక్‌తో కలిసి అర్ధరాత్రి దాటిన తర్వాత సౌమ్య ఇంటికి వెళ్లారు. ముగ్గురూ కలిసి రమేశ్ మెడకు టవల్ బిగించి, దిండుతో ముక్కు, నోరు మూసి చంపారు. ఈ కేసులో నిందితులు సౌమ్య, దిలీప్, అభిషేక్‌తో పాటు సుపారీ గ్యాంగ్ సభ్యులు మాదాపూర్ గ్రామానికి చెందిన జితేందర్, వేణు కిషాన్‌నగర్ తండాకు చెందిన కెలోత్ శ్రీరామ్ ఎలియాస్ బబ్లూ, రమావత్ రాకేశ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడు మోసిన్ పరారీలో ఉన్నాడు.

# ఎమర్జెన్సీ నా జీవితాన్ని మార్చింది

**18 నెలలు జైల్లో పెట్టారు : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

**36వ విజయవాడ పుస్తక మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఉప రాష్ట్రపతి**

**నవలలు, జీవిత చరిత్రలు, కథల పుస్తకాలు ఆధ్యాత్మికం, విప్లవ సాహిత్యంతో పాటు విద్యార్థుల చదువులకు అవసరమైన పుస్తకాల ప్రదర్శన**



కథలు, నవలలు, కామిక్ పుస్తకాలు ఓ వైపు, సెల్ఫ్ డెవలప్‌మెంట్, పోటీ పరీక్షలు, విషయ పరిజ్ఞానం పెంచే బుక్స్, తాళపత్ర గ్రంథాలు మరోవైపు. అన్నీ ఒకేచోట పుస్తక ప్రియులను అలరిస్తున్నాయి. విజయవాడ పుస్తక మహోత్సవం లక్షలాది పుస్తకాలతో రారమ్మని ఆహ్వానిస్తోంది. ఇష్టమైన పుస్తకాలను కొనేందుకు తరలివచ్చిన వారితో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం కళకళలాడింది.విజయవాడలోని బుక్ ఫెస్ట్ పుస్తక ప్రియులకు వరంలా మారింది. 36వ విజయవాడ పుస్తక మహోత్సవంలో 240 కి పైగా స్టాళ్లలో లక్షలాది పుస్తకాలు అందుబాటులో ఉంచారు. నవలలు, జీవిత చరిత్రలు, కథల పుస్తకాలు ఆధ్యాత్మికం, విప్లవ సాహిత్యంతో పాటు విద్యార్థుల చదువులకు అవసరమైన పుస్తకాలు ప్రదర్శనలో ఆకట్టుకుంటున్నాయి. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ఈగల్ టీం ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసింది. ఏపీ గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో ప్రదర్శించిన తాళపత్ర గ్రంథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆదివారం వేలాది మంది పుస్తక ప్రియులు తరలిరాడంతో పండుగ వాతావరణం నెలకొంది. యువత పెద్ద ఎత్తున పుస్తకాలను కొని తీసుకెళ్లారు.ముక్కలైన స్వాతంత్ర్యం: సత్యానికి దగ్గరగా సంచలనాలకు దూరంగా ఉండే రచనలు పెరగాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. పుస్తక మహోత్సవంలో భాగంగా బీజేపీ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ ఆంగ్లంలో రచించి తెలుగులోకి అనువదించిన 'ముక్కలైన స్వాతంత్ర్యం', 'మన రాజ్యాంగం-మన ఆత్మగౌరవం' పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. పుస్తక పఠనం ఆవశ్యకతను వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన రోజే దేశం ముక్కలైన రోజు కావడం విషాదకరమని రాంమాధవ్ విచారం వ్యక్తం చేశారు. ఆనాటి పరిణామాలు యువతకు తెలియజేయాలన్న ప్రధాని మోదీ కోరిక మేరకు తాను ఈ రచనలు చేసినట్లు తెలిపారు. మతానికి భాషతో సంబంధం లేదని ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత మంచిదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అభిప్రాయపడ్డారు. పుస్తక మహోత్సవంలో భాగంగా ఉర్దూ పుస్తక ప్రదర్శన స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. పుస్తక మహోత్సవానికి విశేష స్పందన వస్తోందని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలను కొని చదవాలని కోరారు.సభలు, సమావేశాలకు వెళ్లినప్పుడు శాలువాలు, పుష్పగుచ్ఛాలు, పూల మాలలు ఇస్తున్నారు. వీటివల్ల ప్రయోజనం లేదు. పుస్తక మహోత్సవంలో పుస్తకాలు ఇవ్వడం బాగుంది. ఇదే సంప్రదాయం అన్ని సభల్లోనూ రావాలి. వంద ఊర్లు తిరిగినా తెలుసుకోలేని విషయాలు ఒక్క పుస్తకం చదివి తెలుసుకోవచ్చు. అందుకే పుస్తకం హస్తభూషణం అంటారు. ప్రతి గ్రామంలో గ్రంథాలయాలు, సేవాలయాలు, దేవాలయాలు ఉండాలి. వీటి ఏర్పాటుకు సేవా సంఘాలు, ప్రవాస భారతీయులు ముందుకు రావాలి.రాజ్యాంగ స్ఫూర్తిని గ్రహించడం ముఖ్యం: మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజాస్వామ్య జీవన విధానానికి పునాది లాంటిదని దాన్ని పట్టుకుని తిరిగినా పూజించినా ఫలితం లేదన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని గ్రహించి ఆచరించినప్పుడే ఫలితం దక్కుతుందన్నారు. ప్రజలు తమ హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకుని సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఎవరి పని వారు సవ్యంగా చేయడమే నిజమైన దేశ భక్తి అని ఆయన పేర్కొన్నారు. ఈ రోజుల్లో సత్యానికి దగ్గరగా సంచలనానికి దూరంగా ఉండి ప్రజలకు జ్ఞానాన్ని అందించే పుస్తకాలు చాలా తక్కువగా వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.కానీ ముక్కలైన స్వాతంత్ర్యం, మన రాజ్యాంగం-మన ఆత్మగౌరవం పుస్తకాల్లో మంచి సుగుణాలు కనిపించాయన్నారు.రాంమాధవ్ దేశ విభజన ముందు జరిగిన పరిణామాలు, మత మార్పిళ్లు, జిన్నా ప్రవర్తనలో మార్పులు, ముస్లిం లీగ్ ఏర్పాటు, మత ప్రాతిపదికన దేశాన్ని చీల్చడం, వంటి అనేక అంశాలను కూలంకషంగా వివరించడం బాగుందని వెంకయ్యనాయుడు తెలిపారు. మత ప్రాతిపదికన దేశం విడిపోయినా ఎందరో ముస్లింలు దేశంలోనే ఉన్నారని వారంతా నా దృష్టిలో జాతీయవాదులేనని ఉద్ఘాటించారు. ముక్కలైన స్వాతంత్ర్యం, మన రాజ్యాంగం-మన ఆత్మగౌరవం పుస్తకాలను అందరూ చదవాలని వెంకయ్య నాయుడు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ రూపంలో ప్రజలను ఇబ్బంది పెట్టిందని, ఆ పరిణామం నా జీవితాన్నే మార్చిందని తెలిపారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న తనను 18 నెలలు జైల్లో పెట్టారన్నారు. దీంతో తాను రాజకీయాల వైపు చూశానని చెప్పారు. దేశంలోనే రెండో అత్యున్నత పదవిని నిర్వర్తించినప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.


# మారేడుమిల్లిలోని కాఫీ తోటలు - రెట్టింపు దిగుబడులు- మంచి ఆదాయం

**గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రెట్టింపైన ఫలసాయం**

**ఏపీ అటవీ అభివృద్ధి సంస్థకు మంచి లాభాలు**

**పంటకాలం వ్యవధి మరికొంత కాలం ఉన్న నేపథ్యంలో**

**దిగుబడులు మరింత పెరిగే అవకాశం**



సకాలంలో వర్షాలు కురిసి, వాతావరణం అనుకూలించడంతో ఈ సంవత్సరం మారేడుమిల్లిలోని కాఫీ తోటల్లో రెట్టింపు దిగుబడి వచ్చింది. మారేడుమిల్లిలోని కాఫీ తోటలు మంచి దిగుబడిని సాధించాయి. ఫలితంగా వీటిని సాగుచేస్తున్న ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ)కు మంచి లాభాలు వచ్చే అవకాశం ఏర్పడింది. పంటకాలం వ్యవధి మరికొంత కాలం ఉన్న నేపథ్యంలో దిగుబడులు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు తెలుపుతున్నారు.భద్రాచలం వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిలో మారేడుమిల్లికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో 1961 నుంచి కాఫీ తోటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 76.10 హెక్టార్ల(200 ఎకరాలు)లో తోటలు సాగవుతున్నాయి. వీటిలో 'కావేరీ' రకం మొక్కలు సాగు చేస్తున్నారు. ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో పంట దిగుబడి వస్తుంది. ప్రస్తుతం పండ్లు విరగకాసి, పండిపోయి ఉండడంతో మొక్కలు కళకళలాడుతున్నాయి.మొక్కల నుంచి వీటిని కోసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పంటకోతకు కిలోల చొప్పున కూలీని చెల్లిస్తారు. ఈ సీజన్‌లో పరిసర గ్రామాల గిరిజనులకు తోటల్లో పనిరోజులు అధికంగా లభిస్తున్నాయి. ఏపీఎఫ్‌డీసీ ఆద్వర్యంలో సాగు చేస్తున్న కాఫీతోటల నుంచి గతేడాదితో పోల్చితే ఇప్పటికే రెట్టింపు దిగుబడి లభించింది. సీజన్ ముగిసే నాటికి 7785 కిలోల ఫల సాయం వస్తుందని అంచనా వేస్తున్నారు సంబంధిత అధికారులు.కాఫీ తోటల్లో ఏప్రిల్ నెలలో మొక్కలు పూతకు వస్తాయి. ఈ సమయంలో వర్షం పడితే ఆ పూత అంతా కాయలుగా మారే అవకాశం ఉంటుంది. 2024-25లో పూత దశలో వర్షాలు పడక పోవడంతో పూత అంతా మాడిపోయి, దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. గత ఏప్రిల్‌లో పూత దశలో వర్షాలు విస్తారంగా కురవడంతో దిగుబడి ఆశాజనకంగా ఉందని అసిస్టెంట్ ఎస్టేట్ మేనేజర్ ప్రసాద్ వివరించారు.

ఇప్పటివరకు (కిలోల్లో)
సంవత్సరం - దిగుబడి
2024-25 - 3400
2025-26 - 6750

**శతాబ్ది ఉత్సవాల్లో సీసీఆర్ఐ**

**గిరిజనుల జీవితాన్ని మార్చిన కాఫీ**

తెలుగు రాష్ట్రాలలో కాఫీ తోటలు అనే పేరు ఎత్తగానే ముందుగా గుర్తుకు వచ్చేది మన్యం. అక్కడ అడుగు పెట్టగానే కనుచూపు మేరలో ఈ కాఫీ తోటలే కనిపిస్తాయి. ఈ కాఫీ పంట రాకముందుకు గిరిజన జీవనశైలి వేరు. కానీ ఒక్కసారి ఇది వచ్చాక వీరి జీవన విధానం పూర్తిగా కాఫీ పంటల పైనే ఆధారపడింది. ఓ అతిథిలా అల్లూరికి జిల్లాకు వచ్చి గిరిజనుల జీవితాల్లో ఓ భాగమైపోయింది.ఈ కాఫీపై శాస్త్రీయ పరిశోధనలు జరపడానికి కొంతమంది శాస్త్రవేత్తలు ముందుకు వచ్చారు. దీనికోసం కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌మగళూర్‌లోని బాలహెన్నూర్‌లో 1925లో కేంద్ర కాఫీ పరిశోధనా స్థానాన్ని ప్రారంభించారు. ఆ ప్రాంతమంతా ఈ తోటలు విస్తరించి ఉన్నాయి. దాదాపు 2.50 లక్షల ఎకరాల్లో ఈ కాఫీని పండిస్తున్నారు. అందుకే కాఫీ సాగు అనగానే మన్యం గుర్తుకొస్తూ ఉంటుంది. దీనిపై సుమారుగా 1.35 లక్షలకు పైగా కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. దీంతో గిరిజనుల ప్రధాన ఆదాయ వనరు 75 శాతం కాఫీగానే మారింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ సుమారు 4,000 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ తోటలను సాగు చేస్తోంది. మన్యంలో గిరి రైతులు కాఫీ పండ్లను పండిస్తారు. వీటిని అధికంగా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. 2వ స్థానంలో మ్యాక్స్, జీసీసీ, నాంది, మాతోట వంటి స్వచ్ఛంద సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఉన్నాయి.

# ఫోన్ మాట్లాడుతూ 17 వ అంతస్తు నుంచి కిందపడ్డాడు

**నోయిడాలో విషాదం**

**తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించిన వ్యక్తి**

**ఇంట్లో సిగ్నల్ అందట్లేదని బాల్కనీలోకి..**

**సెక్టార్ 104లోని ఓ అపార్ట్ మెంట్ లో దుర్ఘటన**



ఇంట్లో సరిగా సిగ్నల్ అందట్లేదని ఫోన్ మాట్లాడేందుకు బాల్కనీలోకి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ అక్కడి నుంచి కిందపడిపోయాడు. 17వ అంతస్తు నుంచి పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. రక్తపు మడుగులో పడి ఉన్న అతడిని అపార్ట్ మెంట్ వాసులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే ఆ వ్యక్తి మరణించాడని వైద్యులు తెలిపారు. ఈ విషాదకర సంఘటన నోయిడాలోని సెక్టార్ 104లో ఓ అపార్ట్ మెంట్ లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..కాన్పూర్‌కు చెందిన అజయ్ గార్గ్ (55) ఢిల్లీలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా పనిచేస్తున్నారు. భార్యతో కలిసి నోయిడాలోని 'ఏటీఎస్ వన్ హామ్లెట్' సొసైటీలో నివసిస్తున్నారు. శనివారం ఉదయం 10.20 గంటల సమయంలో అజయ్ కు ఫోన్ వచ్చింది. ఫ్లాట్ లోపల సిగ్నల్ సరిగా అందకపోవడంతో అజయ్ బాల్కనీలోకి వెళ్లారు. ఫోన్ మాట్లాడుతుండగా ప్రమాదవశాత్తూ బ్యాలెన్స్ తప్పి కింద పడిపోయారు.అపార్ట్‌మెంట్ వాసులు హుటాహుటిన అజయ్ ను ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కాగా, అజయ్ గార్గ్ మరణం ప్రమాదవశాత్తూ జరిగిందా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యేల, ఎమ్మెల్సీల సమస్యలపై చర్చలు



**హైదరాబాద్ జనవరి 05 (ప్రజా మంటలు) :** మాజీ శాసనసభ్యులు మరియు మాజీ శాసనమండలి సభ్యుల సంఘం సమావేశం హైదరాబాద్‌లో నిర్వహించబడింది. ఈ సమావేశంలో మాజీ శాసనసభ్యులు, మాజీ శాసనమండలి సభ్యులకు సంబంధించిన వివిధ అంశాలు, సమస్యలు, అలాగే సంఘానికి సంబంధించిన విషయాలపై విస్తృతంగా చర్చ జరిగింది.రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు, మాజీ ప్రజాప్రతినిధుల సంక్షేమం, ప్రజాహితానికి సంబంధించిన అంశాలపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సంఘం భవిష్యత్ కార్యాచరణపై కూడా చర్చించారు.విస్తృత చర్చల అనంతరం, సంఘం తరఫున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిని కలుసుకుని, మాజీ శాసనసభ్యులు మరియు మాజీ శాసనమండలి సభ్యులకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై వినతిపత్రం సమర్పించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ సమావేశంలో పాల్గొన్న సంఘం సభ్యులు: జి. రాజేశం గౌడ్ , కె. లింగయ్య, చాడ వెంకట రెడ్డి, నెరెళ్ల అంజనేయులు, టి. సంతోష్ కుమార్, కట్టెర గంగాధర్, సుధాకర్ రావు, బాలసేని లక్ష్మీనారాయణ, ఎన్. రవిశంకర్ రావు, పట్టూరి సిద్ధాకర్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, కొడూరి సత్యనారాయణ గౌడ్ లు పాల్గొన్నారు.

## గర్భిణులు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలి



**ఇబ్రహీంపట్నం జనవరి 5 (ప్రజా మంటలు దగ్గుల అశోక్) :** గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని సర్పంచ్ ల ఫోరం మండలాధ్యక్షుడు కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట గ్రామపంచాయతీ కార్యాల యంలో విధులు నిర్వహిస్తున్న ఎం సరితకు అంగన్వాడీ కేంద్రంలో సోమవారం అంగన్వాడీ ఉపాధ్యాయులు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ల ఫోరం మండలాధ్యక్షుడు కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి అయిన పంచాయతీ కార్యదర్శి సరిత అంగన్వాడీ కేంద్రంలో సీమంతం చేసుకోవడం అభినందనీయమని కొనియాడారు. గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సరితను ఆదర్శంగా తీసుకొని, ప్రతి ఒక్కరు అంగన్వాడీ కేంద్రంలోనే సీమాంతలు చేసుకోవాలన్నారు. ప్రసూతికి ప్రభుత్వ దవాఖానలో చేరాలన్నారు. నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు పీ రామలక్ష్మి, బీ నవనీత, ఆశకార్యకర్తలు సీహెచ్ వనిత, జే రేణుక, ఐకేపీ వీఓఏ మాధవి, గర్భిణులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జిని కలసిన బార్ సభ్యులు



**మెట్ పల్లి జనవరి 5(ప్రజా మంటలు దగ్గుల అశోక్) :** మెట్ పల్లి బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. రత్న పద్మావతి ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిబ్బందికి స్వీట్లు పంపిణి చేసారు. ఈ కార్యక్రమం లో అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, కోశాధికారి పడిగేల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి గజేల్లి రామ్ దాస్, క్రీడా కార్యదర్శి బిగుల్లా శంకర్, కార్యవర్గ సభ్యులు గజభీంకర్ వెంకటేష్ ఉన్నారు.

## జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో టీఎన్జీవోల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం




**జగిత్యాల జనవరి 5 (ప్రజా మంటలు) :** టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ మరియు ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుసేని గార్ల ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు మిర్యాల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈనాటి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొని టిఎన్జీవో జగిత్యాల జిల్లా సంఘం యొక్క సభ్యత్వం తీసుకోవడం జరిగినది. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ టీఎన్జీవోల సంఘం ఎప్పుడు ఉద్యోగుల శ్రేయస్సు కోసం పనిచేస్తున్నదని పెండింగ్ డీఏలు, ఉద్యోగుల హెల్త్ స్కీం, నూతన పిఆర్సి, సిపిఎస్ రద్దు వంటి అంశాలపై రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వం తో చర్చించి పరిష్కరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు ఎనుగంటి రాజేశం, కార్యదర్శి కుతుబుద్దీన్, టిఎన్జీఓ జిల్లా నాయకులు సుగుణాకర్, శైలజ, విజయలక్ష్మి, సిహెచ్ఓ సాగర్ రావు, ఆరోగ్య విస్తీర్ణ అధికారులు రాజేశం, శ్రీధర్ , రాంకుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు రమణ, భూమేశ్వర్, శంకర్, సీనియర్ అసిస్టెంట్ రమేష్, సుజాత, మురలీధర్, ఇందు శ్యామ్, శ్యామ్ సుందర్, సాగర్, మహేందర్, భాషమియా, శరత్, ఆజాద్, తిరుపతి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, రవీందర్ రాజేందర్, వినయ్, సునంద్, సాయి కృష్ణ, జలజ, సామ్రాట్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ ను కలిసిన ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం



**జగిత్యాల డిసెంబర్ 5 ( ప్రజా మంటలు) :** ఇటీవల జరిగిన ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు సోమవారం కలెక్టరేట్లో మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి జిల్లా కలెక్టర్ అభినందనలు తెలుపుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి మీడియా అని సమాజంలో ఉన్న ప్రజా సమస్యలను పత్రికల ద్వారా తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో అధ్యక్షుడు ఎల్లాల రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కందుకూరి శశిధర్, ఉపాధ్యక్షులు ముసిపట్ల దేవేందర్, బద్దెనపల్లి మల్లేశం, శనిగరపు శ్రీనివాస్, కోశాధికారి శ్రీధర్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కడార్ల రంజిత్ కుమార్, సంయుక్త కార్యదర్శులు బద్దం నారాయణరెడ్డి, గాజుల మహేష్. కార్యవర్గ సభ్యులుగా నీరటి గంగాధర్, కల్లెడ హరీష్, ఎల్ల క్రాంతి కుమార్, సామా మహేష్, వాసం రఘు, ఎండి సాబేర్ లు పాల్గొన్నారు.

## చలి తీవ్రతతో నారుమడులకు రక్షణ చర్యలు అవసరం



**భీమదేవరపల్లి, జనవరి 5 (ప్రజా మంటలు) :** ప్రస్తుత యాసంగి కాలంలో చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో నారుమడులు దెబ్బతినే ప్రమాదముందని భీమదేవరపల్లి మండల వ్యవసాయ అధికారులు రైతులను అప్రమత్తం చేశారు. చలి కారణంగా నారు పెరగకపోవడం, ఆకులు పసుపు ఎరుపు రంగులోకి మారడం, కొన్నిసార్లు నారు చనిపోవడం జరుగుతుందని తెలిపారు.రక్షణ చర్యలుగా సాయంత్రం వేళల్లో నారుమడిలోని నీటిని తీసివేసి పగటిపూట వెచ్చని నీటిని పెట్టాలని సూచించారు. జింక్ లోపం కనిపిస్తే ఒక లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ పిచికారీ చేయాలన్నారు. యూరియా వేయేటప్పుడు కార్బెండజిం, మాంకోజెబ్ మందులు కలపాలని, కాండం తొలుచు పురుగుల నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు చల్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కమలహాసన్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

## నేత్రదాత చందుపట్ల విద్యాసాగర్‌కు నివాళులు



**ధర్మసాగర్, జనవరి 5 (ప్రజా మంటలు) :** మండలంలో నేత్రదాత చందుపట్ల విద్యాసాగర్ సంస్మరణ సభను వారి నివాసంలో కుటుంబ సభ్యులు మరియు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు శంకర్ రావు అధ్యక్షత వహించగా, జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లాల కన్వీనర్ దళపతి, జాతీయ కార్యదర్శి డా. మేరుగు భీష్మాచారి పాల్గొన్నారు. నేత్రదాన ప్రాధాన్యతపై అవగాహన కల్పించగా, ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన విద్యాసాగర్ సేవలను వక్తలు కొనియాడారు. కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన తల్లిదండ్రులు చందుపట్ల అశోక్, శారదతో పాటు అక్కలుబావలు జ్యోతి రాకేశ్, వాణి వినోద్‌లకు, సహకరించిన రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంగల రామచంద్రారెడ్డి, క్యాతం మల్లేశం, బిర్నూర్ తులసీరాం, వేముల కృష్ణాకర్ తదితరులు పాల్గొని నేత్రదాత చందుపట్ల విద్యాసాగర్‌కు శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబ సభ్యులను అభినందించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com